ఉప్పల్‌లో ట్రస్మా క్రీడోత్సవాలు ప్రారంభం



ఉప్పల్ జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో క్రీడోత్సవాలను ప్రారంభిస్తూ..

ఉప్పల్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించాలని ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్‌కుమార్ సూచించారు. మేడిపల్లి మండల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఆధ్వర్యంలో ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు క్రీడలను ప్రోత్సహించడంపై ఆయన అభినందించారు. స్పోర్ట్స్‌లో కూడా విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని తెలిపారు. రెండు రోజుల పాటు క్రీడోత్సవాలు జరుగుతాయని, గెలుపొందిన విజేతలకు ట్రోఫీలను అందజేస్తామని ట్రస్మా కార్యదర్శి మధుసూదన్, జిల్లా అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, మేడిపల్లి మండల అధ్యక్షుడు పి.రవీందర్ తెలిపారు. మండలం నుంచి దాదాపు 40 స్కూళ్ల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఖోఖో, చెస్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న జీవన్ సాగర్ ఎగ్జిబిషన్



బోడుప్పల్: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని ఉప్పల్ డిపో వద్ద ఏర్పాటు చేసిన జీవన్ సాగర్ ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతిరోజూ తిలకిస్తూ ఆనందాన్ని పొందుతున్నారు. నిత్యం బిజీగా ఉండే నగర శివారు ప్రజలు ఆటవిడుపుగా ఈ ఎగ్జిబిషన్‌కు వస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు నారాయణ వెల్లడించారు. జెయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, సోలాంబో, డ్రాగన్ ట్రెయిన్, బోట్ రైడ్, బౌన్సర్, కొలంబస్, మెరిగో రౌండ్ ఎంతో ఆకట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. మహిళలు, యువతులతో నిత్యం జ్యూవలరీ స్టాల్స్, రెడీమేడ్ స్టాల్స్, డ్రైఫ్రూట్ స్టాల్స్, ఆల్ వెరైటీ ఫుడ్స్ స్టాల్స్‌ను సందర్శించి అవసరం ఉన్న వారు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా అండర్ వాటర్ టన్నెల్ అక్వేరియాన్ని మొదటిసారిగా ఏర్పాటు చేయడం ఎంతో ఆకర్షణీయంగా ఉంది. నీటి అడుగున సొరంగ ప్రదర్శన, రెండు వేల చేపలతో ప్రత్యేక ఆకర్షణీయంగా ఉందన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 3 నుంచి రాత్రి 10గంటల వరకు నిర్వహిస్తున్న ఈ జీవన్ సాగర్ ఎగ్జిబిషన్‌ను బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడిపల్లి, ఉప్పల్, ఘట్‌కేసర్, పోచారం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైభవంగా బాలాజీ బ్రహ్మోత్సవాలు



అల్వాల్: అల్వాల్‌లోని బాలాజీ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం స్వామివారిని శేష వాహనంపై అల్వాల్ పురవీధుల్లో ఊరేగించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్తర ద్వార దర్శనం చేసుకోవాలన్నారు. నిర్వాహకులు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన ఆహారం అందించాలి

మల్లాపూర్: వినియోగదారులకు రుచికరమైన ఆహారం అందిస్తే వ్యాపారాభివృద్ధి చెందుతుందని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ ప్రధాన రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన హాట్ బకెట్ బిర్యానీ సెంటర్‌ను కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు యాదగిరి, రమేష్‌కుమార్, రాకేష్‌రెడ్డి, సమ్మిరెడ్డి, బీఆర్ఎస్ నేతలు హమాలీ శ్రీను, కటర్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఘట్‌కేసర్: గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సర్పంచ్ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాచవానిసింగారం పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులతో కలిసి గ్రామాభివృద్ధిపై చర్చించారు. గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట వీధి దీపాలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. వచ్చే హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా నీరు అందించాలని, కావాల్సిన మొక్కలు పెంచుకోవాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ జంగమ్మ, ఉప సర్పంచ్ గీత, వార్డు సభ్యులు విష్ణుగౌడ్, శ్యామ్, సుదర్శన్ ఇతర సభ్యులు పాల్గొన్నారు

సైబర్ మోసాలపై అవగాహన

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని రెడ్‌సన్ జూనియర్ కళాశాల విద్యార్థినులకు సైబర్ మోసాలపై మేడ్చల్ పోలీసులు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మురళీధర్ విద్యార్థినులకు సైబర్ మోసాలు, నేరాలు, లోన్, జాబ్, క్రిప్టో కరెన్సీ, న్యూడ్ కాల్స్, లోన్ యాప్స్ వంటి వాటి పేరిట నేరాలు, మోసం చేసే విధానం, వాటితో జరిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు వాహనాలు నడిపితే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కూల్చివేతలో రాజకీయ కోణం

ఘట్‌కేసర్: అక్రమ నిర్మాణాల కూల్చివేతల్లో రాజకీయ కోణం ఉందని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. కాచవానిసింగారంలో శుక్రవారం బాధితులను పరామర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటు తమకు వేయలేదని కొందరు నాయకులు కూల్చివేయిస్తున్నారని, కబ్జాకు గురైన భూముల్లో నాయకుల హస్తం ఉందని ఆరోపించారు. నాయకుల జోలికి వెళ్లకుండా పేదల ఇళ్లను కూల్చడం ఎంత వరకు సమంజసమని అన్నారు.

పాఠశాల విద్యార్థులకు వర్క్‌షాప్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో పాఠశాల విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. సీఎంఆర్‌సెట్, ఉల్లాస్ ట్రస్ట్ సంయుక్తంగా కాన్ డూ పేరిట నిర్వహించిన వర్క్‌షాప్‌లో 12 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా వారికి పోటీ ప్రపంచంలో తమ నైపుణ్యాలను ఎలా అభివృద్ధి చేసుకోవాలో వివరించారు.

గౌతంనగర్ డివిజన్ పరిధిలో రామారావు, లక్ష్మి నివాసంలో..



బీరప్పగడ్డలోని క్రిస్మస్ సంబరాల్లో కార్పొరేటర్ బన్నాల గీత



ఘనంగా క్రిస్మస్ సంబరాలు

ఉప్పల్: చిలుకానగర్‌లో క్రిస్మస్ సంబరాలు ప్రారంభమయ్యాయి. స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బీరప్పగడ్డ పాస్టర్ జోసఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రార్థనల అనంతరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో వివిధ చర్చిల పాస్టర్లు, స్థానిక నేతలు బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, జగన్, నవీన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మిర్జాల్‌గూడ చిన్మయ్ మార్గ్‌లో శుక్రవారం రామారావు, లక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. అనంతరం అనాథ వృద్ధులకు అన్నదానంతో పాటు చీరలు పంపిణీ చేశారు. పాస్టర్లు విజయ్, శ్రీనివాస్, జంగాల శ్రీరామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లయింగ్ కలర్స్ స్కూల్లో..

మేడిపల్లి: మేడిపల్లి ఎస్ఐఎస్ కాలనీ ఫ్లయింగ్ కలర్స్ స్కూలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులు అలరించారు. కేక్‌కట్ చేసి చిన్నారులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పద్మామూర్తి, ప్రిన్సిపల్ కళ్యాణి, టీచర్స్ అన్నపూర్ణ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో..

మేడిపల్లి: మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ప్రీ కిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ సైదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనురాగ్ స్కూల్‌లో..

కాప్రా: ఎల్లారెడ్డిగూడలోని అనురాగ్ మానసిక వికలాంగుల స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ రామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు సౌత్ ఇండియా బ్యాంక్ డీజీఎం శశిధర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ రామ్, సౌత్ ఇండియా బ్యాంక్ క్లస్టర్ మేనేజర్ పావని, మేనేజర్ మిథున్ మోహన్, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఫ్లయింగ్ కలర్స్ స్కూల్లో క్రిస్మస్ వేడుకలు



మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ప్రీ క్రిస్మస్ ఉత్సవాలు



అనురాగ్ స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

గణితంలో మెళకువలు నేర్చుకోవాలి

విద్యాజ్యోతి స్కూల్ డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి



చెంగిచర్ల విద్యాజ్యోతిలో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి



బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు

బోడుప్పల్: పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే గణితంలో మెళకువలను ఆకళింపు చేసుకుని సాధన చేయాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని 'మ్యాథ్ మా' పేరుతో నిర్వహించిన మ్యాథ్ ఎగ్జిబిషన్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక, ప్రాథమికోన్నత తరగతులకు చెందిన విద్యార్థులు పాల్గొని గణితంకు సంబంధించిన పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అనిల్ అయ్యంగార్, లక్ష్మినారాయణ, వరప్రసాద్, ప్రిన్సిపాల్ నీలిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో..

బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో గణిత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

మల్లాపూర్: నాచారం డక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు గణిత శాస్త్ర ప్రాముఖ్యతను తెలియజేశారు. మ్యాథమెటిక్స్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, చీఫ్ అకాడమిక్స్ డైరెక్టర్ పవన్, సాంబ, కిషోర్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుమ మీనన్, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణ మణికంఠ, రమ్య పాల్గొన్నారు.

మల్కాజిగిరి భాష్యం పాఠశాలలో..

గౌతంనగర్: మల్కాజిగిరి భాష్యం పాఠశాలలో శుక్రవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామానుజన్ క్యాలిబర్ పరీక్ష, విద్యార్థులకు గణిత ప్రదర్శన, క్విజ్ వివిధ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు బహుమతులు అందజేశారు.



మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. శుక్రవారం నాచారం రాంరెడ్డినగర్‌లో రూ.19 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పర్యవేక్షించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో మిగతా రోడ్లను కూడా పూర్తిచేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. డివిజన్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, కాలనీ అధ్యక్షులు పోగుల వెంకట రమణారెడ్డి, విజయ్‌కుమార్, ప్రకాష్‌గౌడ్, ఇమామ్, ఈశ్వర్, భరణి, కట్ట బుచ్చన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పట్టణంలోని బాలాజీనగర్ శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీఅలివేలు మంగ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. స్వామివారిని, అమ్మవారి విగ్రహ మూర్తులకు నూతన వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి కళ్యాణ మండపంపై ప్రతిష్ఠించారు. అనంతరం బ్రాహ్మణుల వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహిచారు. కల్యాణంలో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య దంపతులు కల్యాణంలో పాల్గొని అన్నదానం చేశారు. నిర్వాహకులు శ్రీసదానంద యోగీశ్వరులు చింతపండు సంజీవయ్య, ఆలయ పురోహితులు, నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సమాజానికి దోహదపడే ఆవిష్కరణలు రూపొందించాలి



మాట్లాడుతున్న ముఖ్యఅతిథి యజ్ఞనారాయణ

ఘట్‌కేసర్: సమస్యలు శోధించినప్పుడే సమాజానికి దోహదపడే ఆవిష్కరణ రూపొందించవచ్చని హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ యజ్ఞనారాయణ అన్నారు. శుక్రవారం అనురాగ్ యూనివర్సిటీలో సీఎస్ఈ విభాగం, స్విం‌జర్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అడ్వాన్సెస్ ఇన్ కంప్యూటేషన్ ఇంటలీజెన్స్ అండ్ ఇన్ఫర్మాటిక్స్–2023 (ఐసీఏసీఐఐ–2023)కు గౌరవ అతిథి ప్రొఫెసర్లు విష్ణు ఎస్.పెంద్యాల, ప్రత్యూష నూతలపాటితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన పరిశోధన విషయాలు తెలుసుకోవడానికి కాన్ఫరెన్స్‌లు ఉపయోగపడతాయని, అధునాతన టూల్స్ వినియోగించి మెరుగైన అప్లికేషన్లు సృష్టించాలని సూచించారు. సాంకేతికతలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పరిశోధనలు జరపాలని యూనివర్సిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సీఈఓ నీలిమా, చాన్స్‌లర్ యూబీ దేశాయ్, వైస్ చాన్స్‌లర్ రామచంద్రం, ప్రొఫెసర్లు విష్ణుమూర్తి, ఫాతిమా, బాలాజీ, విజయ్‌కుమార్, బాలకృష్ణ, డీన్‌లు, హెచ్ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తడి, పొడి, హానికర చెత్తను వేరుచేయాలి

ఘట్‌కేసర్: తడి పొడి చెత్తతో పాటు హానికరమైన చెత్తను వేరు చేయాలని ఒకటో వార్డు కౌన్సిలర్ చందుపట్ల వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీ నగర్ బీ1, బీ2 కాలనీలో మేక్ ఇండియా స్వచ్ఛ గ్రీన్ జైన్‌లో భాగంగా 'నా చెత్త.. నా బాధ్యత' క్లాత్ బ్యాగులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హానికరమైన వస్తువులు గాజు, సీసం, ఇనుము, స్టీలు, తుప్పు పట్టిన వస్తువులను వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం వావ్ ఐటీసీ వారి ఆధ్వర్యంలో క్లాత్ బ్యాగులను ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమణ, అశ్విని, కన్యాకుమారి, వావ్ ఐటీసీ సభ్యులు రామకృష్ణ, అనురాధ, వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

25న పద్మశాలి సంఘం వార్షికోత్సవం

కాప్రా: పద్మశాలి సంఘం కాప్రా సర్కిల్ 32వ వార్షికోత్సవాన్ని ఈ నెల 25న నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రతినిధులు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా ఏఎస్‌రావునగర్ మార్కేండేయనగర్‌లోని పద్మశాలి భవన్‌లో శనివారం వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా పద్మశాలి సామాజికవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ పాల్గొననున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, రిటైర్డ్ ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని సంఘం అధ్యక్షులు బింగి సత్యనారాయణ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



మల్లాపూర్: వయోవృద్ధులకు మల్లాపూర్ ఈస్ట్ అన్నపూర్ణ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను పలువురు సీనియర్ సిటిజన్స్ కొనియాడారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్లు దిలీప్, కో ఆర్డినేటర్ శివ, కాలనీవాసులు, సీనియర్ సిటిజన్స్ వీఎస్ఎన్ చౌదరి, కటార్ల శేఖర్‌బాబు, భానుచందర్‌రెడ్డి, మెబిన్, మల్లారెడ్డి, ఆంజనేయ ప్రసాద్, రజమల్లు యాదవ్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నతస్థాయికి ఎదగాలి



అల్వాల్: ప్రతి బాలిక చదువులో ఉన్నత స్థితికి ఎదగాలని జెండర్ స్పెషలిస్ట్ సవిత అన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సంక్షేమ అధికారి ఎం.క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు మహిళా సాధికారత కేంద్రం శుక్రవారం నేరేడ్‌మెట్ మండలం ప్రాథమిక పాఠశాలలో భేటీ బచావో.. భేటీ పడవో అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలకు పౌష్టికాహారం అవసరమన్నారు. రానున్న రోజుల్లో బాలికలు అబ్బాయిలతో సమానంగా ఎదగాలని మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ సవిత, శ్రావణి పేర్కొన్నారు. కార్యక్రమంలో లింగం సమానత్వం, గుడ్‌టచ్ బ్యాడ్ టచ్, చైల్డ్ రైట్స్, హెల్ప్‌లైన్ నంబర్ 100, 1098పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత బృందం సభ్యులతో పాటు పాఠశాల ప్రధానోధ్యాయులు హరిసింగ్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు



నకిలీ కరెన్సీ నోట్లను చూపిస్తున్న సీపీ సుధీర్‌బాబు

అల్వాల్: నకిలీ కరెన్సీ నోట్ల తయారీ రాకెట్ గుట్టును రాచకొండ పోలీసులు రట్టు చేశారు. నేరేడ్‌మెట్‌లోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్‌కు చెందిన మహ్మద్ బహుద్దీన్(53) అటవీ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసేవాడు. 2014లో ఇతడిని సస్పెండ్ చేశారు. అనంతరం రియాల్టీ స్టేట్ బ్రోకర్‌గా పనిచేస్తూ నిజామాబాద్ జిల్లాకు చెందిన ట్యాక్సీ డ్రైవర్ బంపాని ఆండర్‌సన్(37), నిర్మల్ జిల్లాకు చెందిన టాక్సీ డ్రైవర్ మగ్గిడి కిషన్‌తో పరిచయం ఏర్పర్చుకొని నకిలీ కరెన్సీ తయారు చేయడం ప్రారంభించారు. మనోరంజన్ నోట్లను పంపిణీ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఎల్‌బీ నగర్ ఎస్‌వోటీ పోలీసులు నిఘా పెట్టి నిందితులను అరెస్టు చేశారు. వీరిపై గతంలో గోపాలపురం పోలీస్ స్టేషన్, పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లలో 2010లో కేసులు నమోదయ్యాయి. వీరి నుంచి మూడు అసలు 500 వందల నోట్లు, రూ.60 లక్షల నకిలీ నోట్లు, డూప్లికేట్ నంబర్ ప్లేట్‌తో ఉన్న కారు, 6 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి



విద్యుత్ అధికారితో మాట్లాడుతున్న భరత్‌నగర్, కౌకూర్ వాసులు

అల్వాల్: భరత్‌నగర్, కౌకూర్, వాంబే కాలనీలో కొంతకాలంగా నెలకొన్న విద్యుత్ సరఫరా సమస్యలతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ నేత మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు కాలనీలవాసులు శుక్రవారం కలిశారు. కాలనీల్లో సుమారు 400కు పైగా కుటుంబాలు ఉన్నాయని విద్యుత్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు ఉన్నందున వీలైనంత తక్కువ ఖర్చుతో విద్యుత్ మీటర్లను అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మైనంపల్లి హన్మంతరావు విద్యుత్ శాఖ డీఈ సుభాష్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వీలైనంత త్వరలో సమస్యను పరిష్కరిస్తానని డీఈ సుభాష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జితేంద్రనాథ్, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, మల్లికార్జున్, రాజు యాదవ్, వంశీ, కవిత, ఫిలిప్స్ తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ముఠా అరెస్టు



అల్వాల్: మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ముఠాను ఎల్‌బీ నగర్ పోలీసులు అరెస్టు చేశారు. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. రాజమండ్రికి చెందిన వీరం నాగేశ్వర్(24) బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలసవచ్చి కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. కోదాడకు చెందిన కలతిరిపి జితేంద్ర(25) సినిమాల్లో డబ్బింగ్ సౌండ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ కలిసి బెంగళూరు నుంచి మాదకద్రవ్యాలను తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎల్‌బీ నగర్ ఎస్‌వోటీ పోలీసులు, వనస్థలిపురం పోలీసులు కలిసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 30 గ్రాముల మాదకద్రవ్యం ప్యాకెట్లను, 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించారు.